ప్రజల ఇంటికే సుపరిపాలన


నూతన హంగులతో సబ్బవరం సచివాలయం


సేవలందిస్తున్న ఆదిరెడ్డిపాలెం సచివాలయం

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

రేషన్ కార్డు నుంచి పట్టాదార్ పాస్ పుస్తకం వరకూ... బర్త్, క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్... ఇలా ఏ ధ్రువీకరణపత్రం కావాలన్నా, ఏ అవసరమున్నా... వలంటీర్లే ఇంటికి వచ్చి దరఖాస్తు చేసి, రోజుల వ్యవధిలోనే మంజూరు చేసేలా సచ్చివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతంగా సృష్టించారు. మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ్య సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలలో సచివాలయ వ్యవస్థ ప్రధానమైంది. ప్రతి పంచాయతీ, గ్రామంలో అక్కడి ప్రజల సమస్యలు స్థానికంగానే సులువుగా పరిష్కరించేందుకు ఉద్దేశించిన ఈ వ్యవస్థ దేశంలోని చాలా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. గతంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా.. ఏ పని జరగాలన్నా మండల, జిల్లా కేంద్రాలకు రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. సమయం, డబ్బు వృథాతోపాటు ప్రయాసపడేవారు. ప్రస్తుతం గ్రామంలోనే పనులు పూర్తవుతుండడంతో ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ధ్రువీకరణ పత్రాల జారీతోపాటు 33 రకాల సేవలు స్థానికంగానే అందుతున్నాయి. ముఖ్యంగా నాయకుల ప్రమేయం, సిఫారసుల పని లేకుండా అర్హతే ప్రామాణికంగా, వివక్షకు తావులేకుండా అందరికీ సేవలందుతున్నాయి.

– సబ్బవరం



సబ్బవరం మండలంలో పరిస్థితి ఇదీ...

67,334	మండలంలోని మొత్తం జనాభా
24	గ్రామ పంచాయతీలు
20	మండలంలోని సచివాలయాలు
రూ.5.45 కోట్లు	ఈ నిధులతో మండలంలో గ్రామ సచివాలయాలు నిర్మించారు.
143	గ్రామ సచివాలయాల ఉద్యోగుల సంఖ్య
363	మొత్తం సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లు

పాలన, సేవలు చేరువయ్యాయి



వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం నుంచి పాలన, సేవలు ప్రజలకు అతి చేరువలోకి వచ్చాయి. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండానే సంక్షేమం, సర్టిఫికెట్లు ఇంటి గుమ్మం ముందు అందుతున్నాయి. ఈ విషయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి హేట్సాఫ్ చెబుతున్నాం.

– ఉప్పలి దుర్గారావు, గుల్లేపల్లి

తిరిగే పని తప్పింది



గతంలో చిన్న సర్టిఫికెట్ కావాలన్నా రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు వలంటీర్లు, సచివాలయాల సిబ్బందే ఇంటింటికీ వచ్చి ఏ పథకానికి ఎవరు అర్హులు అని ఆరా తీసి మంజూరు చేస్తున్నారు. ఈ వ్యవస్థతో ప్రజలందరికీ మేలు జరుగుతోంది.

– పిల్లల అప్పలనాయుడు, రాయపుర అగ్రహారం


అమృతపురం సచివాలయం సిబ్బంది, వలంటీర్లతో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ నివాస్ (ఫైల్)


సచివాలయంలో సేవలందిస్తున్న సిబ్బంది

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేసి, ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.


జీలకర్ర బెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

పీఏసీఎస్‌తో ప్రజలకు మెరుగైన సేవలు


పీఏసీఎస్ చైర్మన్ నరసింహమూర్తి

పెందుర్తి: పెందుర్తి ప్రాథమిక వ్యవసాయ పరపతి కేంద్రం(పీఏసీఎస్) సహకార బ్యాంక్ ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తున్నామని చైర్మన్ శరగడం నరసింహమూర్తి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సహకార సంఘాలకు పూర్తిస్థాయి సహకారం అందుతుందన్నారు. గురువారం పెందుర్తిలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అతి తక్కువ వడ్డీ రేట్లతో అనేక రుణాలు అందిస్తున్నామన్నారు. స్వల్పకాలిక పంట రుణాలతో పాటు బంగారు ఆభరణాలు, జాయింట్ లయబిలిటి గ్రూప్(జేఎల్‌జీ)లకు, వ్యక్తిగత రుణాలు, వ్యాపార రుణాలను తక్కువ వడ్డీకి మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. త్వరలో విద్య, హౌసింగ్, వాహనాలకు రుణాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ప్రజలు తమ అవసరాలకు రుణాలు తీసుకుని తద్వారా ఆర్థిక పరిపుష్టి సాధించాలని ఆకాంక్షించారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలని కోరారు. రుణాలపై సందేహాలు ఉన్నవారు పెందుర్తి కూడలి వద్ద ఉన్న బ్యాంక్‌లో సంప్రదిస్తే అధికారులు తగిన సూచనలు, సలహాలు అందిస్తారన్నారు.

మురుగునీటి సమస్యకు పరిష్కారం

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు గొల్లవిల్లివానిపాలెం సమీప సాయిసాధనగర్‌లో దీర్ఘకాలికంగా వేధిస్తున్న మురుగునీటి కాలువ సమస్యకు జీవీఎంసీ తక్షణ పరిష్కారం చూపింది. కార్పొరేటర్ ముమ్మన దేముడు చొరవతో కాలనీలోని కాలువకు మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఆదేశాలతో అధికారులు గురువారం సిమెంట్ పైపులు అమర్చారు. ఆయా పనులను కార్పొరేటర్ దేముడు స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ అవుట్ లెట్ లేక ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించినందుకు కార్పొరేటర్ దేముడు, మేయర్, ప్రభుత్వానికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. జీవీఎంసీ ఏఈ దుర్గాప్రసాద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేముడు

బీసీ బాలుర వసతి గృహం నిర్వహణపై అసంతృప్తి

పరవాడ: స్థానిక బీసీ బాలుర వసతి గృహం నిర్వహణపై మండల విద్యా శాఖాధికారులు ఎం.దివాకర్(ఎంఈవో–1), జి.సాయిశైలజ(ఎంఈవో–2) అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ బాలుర వసతి గృహాన్ని బుధవారం రాత్రి అధికారుల బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ బృందంలో పరవాడ ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఎంఈవోలు, మండల వ్యవసాయాధికారి తదితరులు ఉన్నారు. వసతి గృహంలో విద్యుత్ సౌకర్యం లేక విద్యార్థులు చీకటిలోనే భోజనాలు చేయడం గమనించారు. హాస్టల్‌ను సంబంధిత ప్రధానోపాధ్యాయులు వారానికొకపర్యాయం తనిఖీ చేయాలని ఎంఈవోలు సూచించారు. వసతి గృహంలో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని చెప్పారు. తనిఖీకి వెళ్లిన సమయంలో వార్డెన్ అందుబాటులో లేరు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత హాస్టల్ వార్డెన్‌కు సూచించారు.


బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న మండల విద్యాశాఖాధికారులు

తుపాను బాధిత రైతులను ఆదుకోవాలి


గుల్లేపల్లిలో నీట మునిగిన వరి క్షేత్రాలను పరిశీలిస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి


పరవాడలో నేలకొరిగిన వరి పంటను చూపుతున్న రైతులు


మల్లునాయుడుపాలెంలో వరి పంటపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న రైతు

సబ్బవరం: ఇటీవల సంభవించిన తుపానుకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి కోరారు. మండలంలో 4 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నీట మునిగి దెబ్బతిన్న వరి పంట పొలాలను ఆమె వ్యవసాయ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో దెబ్బతిన్న పంట పొలాలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయాలని ఎంపీపీ సూచించారు. గ్రామ స్థాయిలోని వ్యవసాయ సహాయకులు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి రైతులందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు. రబీకి అవసరమైన అపరాలు విత్తనాలు అందజేయాలన్నారు. వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా వరి గింజలు మొలకెత్తకుండా ఏవిధమైన చర్యలు తీసుకోవాలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, గుల్లేపల్లి నాయకులు బండారు శ్రీను, ఎం.భాస్కరరావు, వీఏఏ హేమలత పాల్గొన్నారు.

పరవాడ: మండలంలో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు వి.వి.రమణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. తుపాను వల్ల మండలంలో దెబ్బతిన్న వరి పంటను వారు గురువారం పరిశీలించారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు పరిహారంగా చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిరపరపు శ్రీనివాసరావు, గెడ్డం నాగేశ్వరరావు, పైల అప్పారావు, రాజాన లక్ష్మి పాల్గొన్నారు.

ఉప్పు ద్రావణం పిచికారీ

సబ్బవరం: మల్లునాయుడుపాలెంలో శ్రీకాకుళంలోని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు గురువారం పర్యటించారు. తుపాను ప్రభావంతో నీట మునిగిన వరి పొలాలను పరిశీలించి గింజలు మొలకెత్తకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ వీఏఏలు హేమలత, రమాదేవి, విద్యార్థులు బి.భారతి, టి.స్నేహ, ఎస్.సుప్రియ, కె.పుష్పాంజలి, సిహెచ్.మాధురి, రైతులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పోలేరమ్మ ఆలయ ప్రారంభోత్సవం


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, తదితరులు

పెందుర్తి: పెందుర్తి సమీపంలోని ద్రోణంరాజునగర్‌లో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ తల్లి ఆలయాన్ని గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. ముందుగా అమ్మవారికి అభిషేకాలు జరిపారు. హోమాలు చేశారు. మధ్యాహ్నం దాదాపు 3 వేల మందికి అన్నదానం చేశారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దంపతులు, స్థానిక నాయకులు లెక్కల రమేష్, కిల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ విద్యార్థులకు వర్క్‌షాప్


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ శ్రీనివాస్

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం వర్క్‌షాపు నిర్వహించారు. ఇన్వెస్టర్ అవేర్నెస్ ప్రొగ్రాం–కమోడిటీ, డెరివేటివ్స్ మార్కెట్‌పై సెబీ(సెక్యూరిటీ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) ట్రైనర్ ఎం.శ్రీనివాస్ కామర్స్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్‌సీడీఈఎక్స్–ఐపీఎఫ్‌టీ(నేషనల్ కమోడిటీస్ డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్–ఇన్వెస్టర్స్ ప్రొటక్షన్ ఫండ్ ట్రస్ట్) సహకారంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శంకర్, కామర్స్ అధ్యాపకురాలు బి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పల్లవానిపాలెంలో పట్టపగలే చోరీ


వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్ సభ్యులు


ఘటనా స్థలంలో పోలీసు అధికారులు

7 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేలు నగదు అపహరణ

సబ్బవరం: మండలంలోని గాలిభీమవరం శివారు పల్లవానిపాలెంలో గురువారం పట్ట పగలే చోరీ జరిగింది. ఏడు తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.50 వేలు నగదు అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పల్ల నాగరాజు(34) సోదరుడు నర్సింగరావు అయ్యప్ప మాల వేశారు. గురువారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఇరుముడులు కార్యక్రమం జరుగుతుంది. దీంతో కుటుంబ సభ్యులంతా ఇంటికి తాళం వేసి ఆ కార్యక్రమం వద్దకు వెళ్లారు. మరోవైపు పక్క వీధిలో వివాహం జరుగుతుండడంతో గ్రామంలో హడావిడిగా ఉంది. అదే అదునుగా చూసుకుని గుర్తు తెలియని వ్యక్తులు.. నాగరాజు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువా తాళం విరగ్గొట్టి లోపల ఉన్న ఏడు తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.50 వేలు నగదు అపహరించుకుపోయారు. ఇంటిని ఆనుకుని ఉన్న నాగరాజు సోదరుడు ఇంటి తాళం కూడా పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువా తాళం పగల గొట్టి వెతుకుతుండగా.. ఇంటి గేటు తీసిన శబ్దం వినిపించడంతో ఇంట్లోకి వస్తున్న నర్సింగరావు కుటుంబ సభ్యులను తోసుకుని దొంగలు పరారయ్యారు. స్థానికులు గమనించి వెంబడించినా ప్రయోజనం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సీఐ రంగనాథం, ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తమ సిబ్బందితో వెళ్లి వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి వివరాలను సేకరించారు. బాధితుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రంగనాథం తెలిపారు. నర్సింగరావు ఇంట్లో ఎటువంటి వస్తువులు పోలేదని సీఐ తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్

సింహాచలం : పాత గోశాల నుంచి వేపగుంట వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డులో గురువారం పెనుప్రమాదం తప్పింది. పాత గోశాల నుంచి వేపగుంట వైపు వెళ్తున్న కారు అతి వేగంతో వచ్చి రోడ్డుకి ఎడమవైపు ఉన్న విజయ్ హెలీనా ఆస్పత్రి వద్ద పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. అలాగే అక్కడే ద్విచక్ర వాహనం పార్క్‌చేసి కూర్చున్న తల్లి, కుమారుడిని ఢీకొట్టింది. దీంతో తల్లి భవానీకి గాయాలయ్యాయి. ప్రమాదంలో ఒక బైకు బాగా దెబ్బతింది. గాయాలపాలైన భవానీని స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.